## • స్వీయ ఆత్మరక్షణ శిక్షణకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం స్వీయ ఆత్మరక్షణపై విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం అరుదైన ఘనత సాధించింది. జిల్లా పోలీసుశాఖ సహకారంతో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్వీయ ఆత్మరక్షణ (తైక్వాండో)పై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతోపాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొని రికార్డు సృష్టించారు. ఏకకాలంలో 11 వేల మంది శిక్షణలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించి 'లిమ్కా బుక్ రికార్డ్స్'లో చోటుదక్కించుకున్నారు. - ఖలీల్‌వాడి

# ఆదిలాబాద్‌లో నేడు ప్రధాని పర్యటన

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో సభ

ఆదిలాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ప్రధాని రూ.15,718 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఉదయం 10.20 గంటలకు ప్రధాని హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ చేరుకుంటారు. అనంతరం బహిరంగ సభ వేదిక వద్దనే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఇందుకోసం సభా ప్రాంగణం సమీపంలో శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. ఇందులో 800 మెగావాట్ల రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు, యాదాద్రి ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఆదిలాబాద్, బేల రెండు వరుసల రోడ్డు విస్తరణ పనులను, ఆదిలాబాద్ పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, ఇతర పనులను ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడి 12.15 గంటలకు మహారాష్ట్రలోని నాందేడ్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు పట్టణంలో పూర్తి బందోబస్తు ఏర్పాటుచేశారు.

### అంబారి-ఆదిలాబాద్ రైల్వేలైన్ ప్రారంభం

అంబారి-ఆదిలాబాద్- పింపల్‌కుట్టి రైలు మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. అంబారి-ఆదిలాబాద్- పింపల్‌కుట్టి రైల్వేస్టేషన్ల మధ్య సుమారు రూ.70 కోట్ల వ్యయంతో 71 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. ప్రధాని రాక నేపథ్యంలో అన్ని ఏర్పాట్లన్నీ పూర్తిచేశామని చెప్పారు. ఈ లైన్‌లో 46.6 కిలోమీటర్లు తెలంగాణ ప్రాంతంలో ఉండగా.. మిగిలినది మహారాష్ట్రలో ఉన్నది. దక్షిణ మధ్య రైల్వేలో భాగమైన సికింద్రాబాద్-నాగపూర్ (నిజామాబాద్ మీదుగా) సెక్షన్ తర్వాత ఈ మార్గం వస్తుందని అధికారులు తెలిపారు. ఈ మార్గంలో విద్యుదీకరణ పనులు పూర్తి కావడం వల్ల హైదరాబాద్ మీదుగా బెంగళూరు, నాగపూర్ వైపు, అలాగే ఉత్తర భారతదేశం వైపు ప్రయాణ సదుపాయాలు, సరుకు రవాణా మరింత మెరుగవుతుందని అన్నారు.

### ప్రధాని పర్యటనను నిరసిస్తూ బైక్ ర్యాలీ

ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటనను నిరసిస్తూ పట్టణంలో జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ జిల్లాలో ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని ఆందోళనకారులు విమర్శించారు. మూతబడిన సిమెంటు పరిశ్రమను పునఃప్రారంభించాలని, ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని, ఎయిర్‌పోర్టును నిర్మించాలని, నవోదయ పాఠశాలను ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ఓట్లు దండుకోవడం కోసం కేవలం ఎన్నికల సమయంలో జిల్లా పర్యటనలకు వస్తారని, హామీలతో ప్రజలను మభ్యపెడుతారని మండిపడ్డారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించే బహిరంగ సభ ప్రాంగణం

# ఆంధ్రజ్యోతివి అభూత కల్పనలు

- నేను కొన్నది భూదాన్ భూమి కాదు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): వట్టినాగులపల్లిలో తాను భూదాన్ భూమిని కొన్నట్టు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన కథనంలో వాస్తవం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. 'నేను కొన్నది భూదాన్ భూమి కాదు. నాకు అక్కడ ఎకరం 10 గుంటలు మాత్రమే ఉన్నది. 2012లో ఒప్పందం కుదిరింది. 2014లో రిజిస్ట్రేషన్ అయింది. వివరాలను 2015, 2021, 2023 ఎన్నికల అఫిడవిట్‌ల్లో కూడా వెల్లడించాను. కానీ ప్రతిసారీ ఆంధ్రజ్యోతి బీఆర్‌ఎస్ నేతలపై, నాపై అభూత కల్పనలు, అవాస్తవాలు, ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురిస్తున్నది. నేను 2012లో వట్టినాగులపల్లిలో సర్వే నెంబర్ 188/1/2లోని భూమికి సంబంధించిన పూర్తి వివరాలు, లీగల్ ఒపీనియన్ తీసుకొని, రికార్డును క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే దానిని కొనుగోలు చేశాను' అని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. తాను కొన్నది భూదాన్ భూమి కాదని, ఎవరికైనా వివరాలు కావాలంటే ప్రభుత్వపరంగా వెరిఫికేషన్ చేసుకోవచ్చునని లేదా తను సంప్రదించినా తెలియజేస్తానని పేర్కొన్నారు. వట్టినాగులపల్లిలో తనకు ఎకరం 10 గుంటలు మాత్రమే ఉన్నదని, అది ఆంధ్రజ్యోతి పేర్కొన్న 29 ఎకరాల భూముల్లో భాగం కాదని తెలిపారు. లేని భూమిని తన పేరు మీద ఉన్నట్టు, అది భూదాన్ భూమి అయినట్టు పదే పదే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ దుష్ప్రచారం చేయడం వారి దుర్బుద్ధిని, బ్లాక్‌మెయిల్ తత్వాన్ని తెలియజేస్తున్నదని మండిపడ్డారు. ఆంధ్రజ్యోతి కథనాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు.

# తెలంగాణపై ఎందుకీ వివక్ష?

- రోడ్డు మార్గంలో మహారాష్ట్ర, తెలంగాణకు మధ్య పక్షపాతం
- సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభంపై హామీఇచ్చి నాలుగేండ్లు
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరైనా నిధులు లేవు
- ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కాగితాలకే పరిమితం
- జిల్లాలో పర్యటించనున్న ప్రధాని సానుకూలంగా స్పందించేనా!



మూతపడిన ఆదిలాబాద్ సీసీఐ

ఆదిలాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల అడుగడుగునా వివక్షను చూపుతున్నది. గత పదేండ్లలో నిధుల విడుదల-కేటాయింపు, ప్రాజెక్టుల మంజూరులో తెలంగాణ పట్ల శీతకన్ను ప్రదర్శిస్తున్నదన్న విమర్శలు నిత్యం వ్యక్తమవుతూనే ఉన్నాయి. విభజన చట్టంలోని హామీలు నెరవేర్చకపోగా.. ఇంతవరకు పెండింగ్ ప్రాజెక్టుల ఊసే ఎత్తడం లేదు. బడ్జెట్‌లో కేటాయింపులు అసలే లేకుండా పోతున్నాయి.

### మహారాష్ట్రలో నాలుగు వరుసలు

ఆదిలాబాద్ జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దు నుంచి బేల మీదుగా జైనథ్ మండలం భోరజ్ వరకు జాతీయ రహదారి నం.353బీ 32.97 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం బడ్జెట్‌లో రూ.700 కోట్లు కేటాయించింది. కానీ ఈ మార్గంలో వాహనాల సంఖ్య తక్కువగా ఉన్నదనే నెపంతో దానిని రెండు వరుసలకు మార్చింది. ఇదే రహదారి జిల్లా సరిహద్దు ఉపసనాల వరకు మహారాష్ట్ర పరిధిలో నాలుగు వరుసలుగా పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు తెలంగాణలో ప్రవేశిస్తాయి. రూ.375 కోట్లతో నిర్మించే ఆదిలాబాద్ నుంచి బేల రెండు వరుసల విస్తరణ పనులను ప్రధాని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని గతంలో బీఆర్‌ఎస్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు ఆందోళన నిర్వహించాయి.

### సిమెంటు పరిశ్రమ హామీలకే పరిమితం

ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న సిమెంటు పరిశ్రమ (సీసీఐ) పునః ప్రారంభం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. తెలంగాణలో మొదటిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 2018, నవంబర్ 28న ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మూతపడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఐదున్నర ఏండ్లు గడుస్తున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన హన్స్‌రాజ్ గంగారాం సీసీఐని సందర్శించి తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గతేడాది అక్టోబరు 9న ఆదిలాబాద్ వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పరిశ్రమ పునఃప్రారంభంపై కనీసం మాట్లాడలేదు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, భూములు కోల్పోయిన రైతులు, ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు ఆందోళనలు జరిపినా ఫలితంలేదు.

### ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్ నిధులేవి?

కేంద్రం 2009-10 రైల్వే బడ్జెట్‌లో ఆదిలాబాద్ నుంచి పటాన్‌చెరు వరకు రైలు మార్గాన్ని మంజూరు చేసింది. ఇందుకు నిర్మాణ వ్యయం రూ.3,771 కోట్లు భారీగా అవుతుండడంతో తక్కువ ఖర్చుతో ఆర్మూర్ లైన్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆదిలాబాద్-ఆర్మూర్ లైన్‌కు 2017 బడ్జెట్‌లో మంజూరు లభించింది. అధికారులు రూ.2,990 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు వేశారు. కానీ ఇంతవరకు ఈ మార్గానికి నయా పైసా కూడా కేటాయించలేదు.

### విమానాశ్రయం మరిచారు..

ఉడాన్ పథకం కింద ద్వితీయ శ్రేణి నగరాలకు విమానాలు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశాలున్నాయని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాను కోరింది. అధికారుల బృందం ఎయిర్‌పోర్టు మైదానాన్ని పరిశీలించి సానుకూల నివేదికలు అందజేసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో స్థానిక అభివృద్ధితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. కానీ ఈ విషయాన్ని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధాని ఇప్పటికైనా తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చే నిధులు, ప్రాజెక్టుల విషయంలో సానుకూలమైన ప్రకటన చేయాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## మోదీ హామీకి ఐదు నెలలు!

- అమలుకాని పసుపు బోర్డు హామీ
- ప్రజలను మభ్యపెడుతున్న బీజేపీ ఎంపీలు

నిజామాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్ర సర్కారుకు పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో చిత్తశుద్ధి కొరవడింది. 2019 సార్వత్రిక ఎన్నికల వేళ బీజేపీ పెద్దలే నిజామాబాద్ జిల్లాకు వచ్చి పసుపుబోర్డు ఏర్పాటుపై హామీలు గుప్పించారు. అధికారాన్ని దక్కించుకున్న తర్వాత లోక్‌సభ, రాజ్యసభల్లో పసుపుబోర్డు ఏర్పాటే ఉండబోదంటూ ప్రకటన ఇప్పించారు. సీన్ కట్ చేస్తే మొన్నటి కర్ణాటక ఎన్నికల్లో, అంతకు మునుపు తమిళనాడు ఎన్నికల్లో బీజేపీ నేతలంతా పసుపు పేరుతో రాజకీయం చేశారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ సాక్షాత్తు ప్రధానమంత్రి మోదీనే ఒక అడుగు దిగొచ్చి పసుపుబోర్డును తప్పక ఏర్పాటు చేస్తామంటూ ప్రకటన చేశారు. అక్టోబర్ ఒకటిన మహబూబ్‌నగర్ సభలో, అక్టోబర్ మూడున నిజామాబాద్ సభలో రెండుమార్లు ఇదే అంశాన్ని ప్రధాని నొక్కి చెప్పారు. స్వయంగా దేశ ప్రధానే ప్రకటన చేయడంతో పసుపు బోర్డు ఏర్పాటు తథ్యమని అంతా భావించారు. మోదీ హామీకి ఐదు నెలలు నిండినా ఇప్పటికీ ఆ ప్రక్రియకు అతీగతీ లేకుండాపోయింది. సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం పూరించేందుకు మోదీ తెలంగాణకు వస్తున్న నేపథ్యంలో పసుపు బోర్డు మరోమారు చర్చనీయాంశంగా మారింది.

## గ్రీన్‌చాలెంజ్‌తో పర్యావరణ పరిరక్షణ

**డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి**

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌తో పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతున్నదని డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా గొప్ప కార్యక్రమాలను చేస్తున్నారని ప్రశంసించారు. ఆదివారం ఏపీలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరులో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా గ్రామస్థులతో కలిసిమారేడు, రావి, ఉసిరి, వేప, జమ్మి, జామ మొక్కలను నాటారు. రైతులు కలప మొక్కలు పెంచడం ద్వారా అదనపు ఆదాయ మార్గాన్ని సృష్టించుకోవడంతో పాటు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడి జీవావరణ పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషించవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ సహ వ్యవస్థాపకుడు మర్రి కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను రక్షించుకోవాలి

**అటవీ శాఖ మంత్రి సురేఖ**

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓ ప్రకటన విడుదల చేశారు. జంతువులు, పక్షులు, వృక్షజాతుల రక్షణకు అందరూ సంకల్పించాలన్నారు.

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 77,449 మంది దరఖాస్తు చేసుకోగా 69,230 (89.39 శాతం) మంది హాజరయ్యారని ఎంజేపీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు తెలిపారు. 6వ తరగతికి 36,335 మంది దరఖాస్తు చేసుకోగా 32,590 మంది, 7వ తరగతికి 21,764 మంది దరఖాస్తు చేసుకోగా 19,327 మంది, 8వ తరగతికి 19,350 మంది దరఖాస్తు చేసుకోగా 17,313 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# డీఎస్సీ దరఖాస్తులు నేటి రాత్రి నుంచే

- ఈరోజు రాత్రికే ఇన్ఫర్మేషన్ బులెటిన్, ఖాళీల వివరాల ప్రకటన
- దరఖాస్తుదారులకు సాంకేతిక సహాయం కోసం హెల్ప్‌డెస్క్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించే డీఎస్సీ-2024 దరఖాస్తుల స్వీకరణ ఈ రాత్రి నుంచే ప్రారంభం కానున్నది. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానున్నది. ఈ రోజు రాత్రికే ఇన్ఫర్మేషన్ బులెటిన్, జిల్లా, సబ్జెక్టు, రిజర్వేషన్ వారీగా ఖాళీలు, సిలబస్ తదితర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఆ తర్వాత నుంచి ఫీజు చెల్లింపు, దరఖాస్తు చేసుకునే అవకాశాన్నిస్తారు. 2023 డీఎస్సీకి 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వీటిలో 2,629 స్కూల్ అసిస్టెంట్, 6,508 సెకండరీ గ్రేడ్ టీచర్లు, 727 భాషాపండితులు, 182 పీఈటీ పోస్టులున్నాయి. ఇక స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 220 ఉండగా, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 796 ఉన్నాయి. సోమవారం నుంచి ఏప్రిల్ 3 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు గడువు ఏప్రిల్ 2తోనే ముగుస్తుంది. తాజాగా గరిష్ఠ వయోపరిమితిని 46 ఏండ్లకు పెంచడం, అదనంగా పోస్టులను చేర్చడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

### హెల్ప్‌డెస్క్

డీఎస్సీకి దరఖాస్తు చేసేవారి సందేహాలు తీర్చేందుకు అధికారులు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు. సాంకేతిక సహాయం కోసం విద్యార్థులు 91541 14982, 63099 98812 నంబర్లతోపాటు, helpdesk tsdsc2024@gmail.com ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేయదలిస్తే, ప్రతి ఉద్యోగం కోసం వెయ్యి రూపాయలు ఫీజుగా చెల్లించాలి.



### అర్హతలు.. నిబంధనలు

- సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు కేవలం డీఎడ్ పూర్తిచేసినవారే అర్హులు. బీఎడ్ వారు పోటీపడే అవకాశంలేదు.
- స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు (ఎస్‌ఏ) పోస్టులకు సంబంధిత మెథడ్‌లో బీఎడ్ పూర్తిచేసినవారు అర్హులు. నాలుగేండ్ల బీఎడ్ పూర్తిచేసినవారు సైతం పోటీపడొచ్చు.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు, యూజీ డీపీఈడీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసినవారు.. బీపీఈడీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
- బీఎడ్, డీఎడ్ చివరి సంవత్సరం/చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.
- అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితికి కటాఫ్ తేదీగా 1-7-23ను నిర్ణయించారు. ఈ తేదీలోగా 46 సంవత్సరాలు గలవారై ఉండాలి. కనిష్ఠ వయోపరిమితి 18 ఏండ్లుగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు 5, మాజీ సైనికులకు 3, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5, దివ్యాంగులకు 10 ఏండ్ల సడలింపు వర్తిస్తుంది.
- తెలంగాణ, ఏపీ టెట్, లేదా సెంట్రల్ టెట్ (సీ టెట్)లో క్వాలిఫై అయి ఉండాలి.
- గతంలో ఏజెన్సీ పోస్టుల్లో 100 శాతం గిరిజనులకే కేటాయించగా, ఈ నిబంధనను తాజాగా ఎత్తివేశారు. అంతా పోటీపడొచ్చు.
- ఎస్టీ రిజర్వేషన్ గతంలో 6 శాతం ఉండగా, పెంచిన 10 శాతాన్నే వర్తింపజేస్తారు.
- గతంలో లోకల్, ఓపెన్ కోటా రిజర్వేషన్ 80:20 పద్ధతిలో ఉండగా, తాజాగా 95:5 రేషియోను అమలుచేస్తారు.
- అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు గతంలో 4-10 తరగతుల చదువును పరిగణనలోకి తీసుకోగా, తాజాగా 1-7 తరగతులను లెక్కలోకి తీసుకుంటారు.
- జీవో-3 ప్రకారం మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలుచేస్తారు. మూడు పోస్టులుంటే ఒక పోస్టును మహిళతో భర్తీ చేస్తారు.

## కొత్తగా ఐదు ఆఫ్ క్యాంపస్ కాలేజీలు!

- మరో బ్రాంచిని తెరుచుకునే వెసులుబాటు
- ఏఐసీటీఈకి ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల దరఖాస్తు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తొలిసారిగా ఇంజినీరింగ్ కాలేజీలు బ్రాంచీలను ఏర్పాటు చేసుకోబోతున్నాయి. వీటిని ఆఫ్ క్యాంపస్ కాలేజీ పేరుతో పిలుస్తారు. ఇలాంటివి ఐదు ఏర్పాటుకాబోతున్నాయి. రెగ్యులర్ కాలేజీల తరహాలోనే కోర్సులను నిర్వహిస్తాయి. 2024-25 విద్యాసంవత్సరంలో ఆఫ్ క్యాంపస్‌లను ప్రారంభించేందుకు అనుమతినివ్వాలని ఏఐసీటీఈకి బీవీఆర్ ఐటీ, వర్ధమాన్,సహా మరో మూడు కాలేజీలు దరఖాస్తు చేసుకొన్నాయి. సీఎస్‌ఈ, సీఎస్‌ఈ ఏఐఎంఎల్, అనుబంధ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు చేసుకున్నాయి. ఆఫ్ క్యాంపస్ విధానంలో అదే పేరుతో మరో చోట కాలేజీని ప్రారంభించుకోవచ్చు. ఇదివరకు ఆఫ్ క్యాంపస్ ఏర్పాటు అవకాశం స్టేట్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలకే ఉండేది. మంచి పనితీరు కనబరుస్తున్న విద్యాసంస్థలే ఆఫ్ క్యాంపస్‌లను నిర్వహించుకోవచ్చు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్, క్యూఎస్ ర్యాంకింగ్, 50 శాతం కోర్సులకు ఎన్‌బీఏ అక్రెడిటేషన్ ఉన్న కాలేజీలు ఆఫ్ క్యాంపస్‌లను తెరుచుకోవచ్చు. స్వయంప్రతిపత్తి కాలేజీలు, ఐదేండ్లలో 80 శాతం సీట్లు నిండినవి కూడా ఆఫ్ క్యాంపస్‌లు తెరుచుకోవచ్చు. ప్రధాన క్యాంపస్‌లోని ల్యాబ్‌ల వసతులను వినియోగించుకోవచ్చు. తరగతులను ఆఫ్ క్యాంపస్ కాలేజీలోనే నిర్వహిస్తారు. తాజాగా దరఖాస్తు చేసిన కాలేజీలకు ఏఐసీటీఈ గుర్తింపునిచ్చిన తర్వాత జేఎన్టీయూ అధికారులు తనిఖీలు చేపట్టి అనుమతిస్తారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### • విద్యాశాఖ ఉద్యోగుల కోసం ఈజీ యాప్

**అన్ని సమస్యలకు అక్కడే పరిష్కారం • యాప్ నోడల్ అధికారిగా శ్రుతి ఓజా**


హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రూపొందించిన ఈజీ (EASY) యాప్ ఈ వారంలో అందుబాటులోకి రానున్నది. 'ఎడ్యుకేషన్ అడ్వాన్స్‌మెంట్ సర్వీసెస్ ఫర్ యూ' (ఈజీ) పేరును ఈ యాప్‌కు అధికారులు ఖరారు చేశారు. ఈ యాప్ నోడల్ అధికారిగా ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజాను నియమించారు. పాఠశాల విద్య, ఇంటర్, సాంకేతిక, కళాశాల విద్యకు సంబంధించిన ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఈ యాప్‌ను తయారుచేయించారు. ఉద్యోగుల సర్వీస్ సమస్యలు, మెడికల్ బిల్స్, సెలవుల మంజూరు వంటి అంశాలను ఆ యాప్‌లో చేర్చారు. ఉద్యోగి సమస్యను యాప్‌లో నమోదు చేసిన తర్వాత వారం రోజుల్లో పరిష్కరిస్తారు. సూపరింటెండెంట్ హోదా గల అధికారి సమస్యను పరిష్కరించని పక్షంలో పైస్థాయి అధికారి పరిశీలనకు ఈ సమస్య వెళుతుంది. అక్కడ ఈ సమస్యను పరిష్కరిస్తారు.

### • నేటి వరకు జేఈఈ దరఖాస్తుల గడువు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ఐఐటీలు, ఎన్‌ఐటీలు సహా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్-2 దరఖాస్తుల గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పొడగించింది. ఈ గడువు శనివారంతో ముగియగా, తాజాగా సోమవారం వరకు అవకాశాన్నిచ్చింది. అభ్యర్థులు సోమవారం రాత్రి 10: 50 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు చెల్లింపు గడువు మాత్రం రాత్రి 11:50 గంటలతో ముగుస్తుంది. జేఈఈ మెయిన్-1కు హాజరైనవారు స్కోర్‌ను మెరుగుపర్చుకునేందుకు మెయిన్-2కు హాజరుకావొచ్చు. దేనిలో మంచి స్కోర్ వస్తే దానినే పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను విద్యార్థులు ఈ నెల 6 నుంచి 7 వరకు సవరించుకోవచ్చు. ఏప్రిల్ 1 నుంచి 15 వరకు జేఈఈ మెయిన్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ఫలితాలను ఏప్రిల్ 25న విడుదల చేస్తారు.

### • 6 నుంచి ఎడ్‌సెట్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఎడ్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్-24 దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నది. విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తుండగా, ఆలస్య రుసుము లేకుండా మే 6 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశమున్నది. జనరల్ కేటగిరి విద్యార్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.550 ఫీజుగా చెల్లించాలి. ఇక రూ.250 ఆలస్య రుసుముతో మే 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశానిచ్చారు. విద్యార్థులు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షను మే 25న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహిస్తారు.



నూతన కమిటీకి నియామకపత్రం ఇస్తున్న ఎన్నికల అధికారులు

## జేఎన్‌జే సొసైటీ నూతన కమిటీ

**డైరెక్టర్లుగా ఐదుగురు ఎన్నిక**

ఖైరతాబాద్, మార్చి 3 : జవహర్‌లాల్ నెహ్రూ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు నూతన డైరెక్టర్లు కొలువుదీరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఎన్నికలు జరుగగా, టీమ్ జేఎన్‌జే ప్యానల్, ఫ్రెండ్స్ ప్యానెల్‌లు పోటీపడ్డాయి. 13 మంది సొసైటీ సభ్యులు ఈ పోటీలో నిలిచారు. పీవీ రమణారావు 528 ఓట్లు, ఏ వంశీ 430, రవికాంత్‌రెడ్డి 428, కిరణ్‌కుమార్ 401, అశోక్‌రెడ్డి 392 ఓట్లతో మొదటి, రెండో, మూడో, నాలుగో, ఐదో స్థానంలో నిలిచారు. ఫ్రెండ్స్ ప్యానెల్ నుంచి ముగ్గురు, టీం జేఎన్‌జే ప్యానెల్ నుంచి ఇద్దరు గెలిచారు. బరిలో 13 మంది నిలువగా మొత్తం 87.2 శాతం పోలయ్యాయి.

## పెండింగ్ బిల్లులను మంజూరుచేయాలి

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ట్రెజరీ కార్యాలయాల్లో ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వానిన డిమాండ్ చేసింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించగా, రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, సీహెచ్ రాములు, దుర్గాభవాని, లక్ష్మారెడ్డి, సోమశేఖర్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు 'నాన్‌జాయినింగ్' గండం

- ఉద్యోగ ఫలితాల వెల్లడిలో ప్రభుత్వ ప్రణాళిక లోపం
- కొందరికి ఒకటికంటే ఎక్కువ ఉద్యోగాల్లో అర్హత
- ఒక్కదాంట్లోనే చేరడంతో పెరుగుతున్న బ్యాక్‌లాగ్‌లు
- వాటిని మెరిట్ అభ్యర్థులతో నింపాలంటున్న మేధావులు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరుసగా టీఎస్‌పీఎస్సీ, గురుకుల, పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన తుది ఫలితాలు వరుసగా విడుదలవుతున్న నేపథ్యంలో కొందరు రెండుమూడు ఉద్యోగాలకు ఎంపికైనా ఒక్కదాన్నే ఎంపిక చేసుకోవాల్సి వస్తున్నది. మిగతా ఉద్యోగాలను వదిలేస్తున్నారు. ఇలాంటి 'నాన్‌జాయినింగ్ పోస్టుల'ను ఏం చేయాలనేదానిపై ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. దీంతో అవన్నీ బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోతున్నాయి. ఇలా ఒక్కో నోటిఫికేషన్‌లో కనీసం10 శాతం 'నాన్‌జాయినింగ్ పోస్టులు' ఉంటాయని అంచనా.

### ఫలితాల వెల్లడిలో ప్రణాళిక లోపం..

సాధారణంగా ఒక అభ్యర్థి అర్హత ఉన్న నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసి, పరీక్ష రాస్తుంటాడు. ఒకేసారి రెండుమూడు పోస్టులకు ఫలితాలు వస్తే మంచి జీతం, హోదా ఉన్న ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుంటాడు. కాబట్టి ఉద్యోగాల స్థాయిని బట్టి అవరోహణ క్రమంలో ఫలితాలు విడుదల చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. కానీ ప్రభుత్వం భారీ సంఖ్యలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకోవాలన్న హడావుడిలో సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్నది. ఉదాహరణకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డిగ్రీ లెక్చరర్లు (డీఎల్), జూనియర్ లెక్చరర్లు (జేఎల్), పీజీటీ, టీజీటీ పోస్టులకు పరీక్షలు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫలితాలు వెల్లడిస్తున్నది. ముందుగా 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి, 1:1 నిష్పత్తిలో తుది ఫలితాలు విడుదల చేస్తున్నారు. ముందుగా డీఎల్ పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, తుదిఫలితాలు వెల్లడించి, తర్వాత వరుసగా జేఎల్, పీజీటీ, టీజీటీలకు కనీసం వారం రోజుల వ్యవధితో నియామకాలు పూర్తిచేస్తే అభ్యర్థులు పెద్ద ఉద్యోగాలవైపు మొగ్గు చూపేవారు.. తర్వాతి స్థాయి ఉద్యోగాల్లో 'నాన్‌జాయినింగ్' సమస్య ఉండేది కాదు. కానీ ప్రభుత్వం ముందుగా పీజీటీ తుదిఫలితాలు ఇచ్చిన తర్వాత, డీఎల్, జేఎల్‌కు 1:2 నిష్పత్తితో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచింది. తుదిఫలితాలు విడుదల చేయకముందే టీజీటీ సర్టిఫికేషన్ నిర్వహించింది. అది పూర్తికాగానే డీఎల్, జేఎల్ తుది ఫలితాలు వెల్లడించింది. దీంతో టీజీటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన పదుల మంది అభ్యర్థులకు డీఎల్, జేఎల్‌లో అవకాశం వచ్చింది. దీంతో టీజీటీ తుదిఫలితాల్లో వాళ్ల పేర్లు ఉన్నా చేరని పరిస్థితి. అలాకాకుండా ప్రభుత్వం ముందుగానే డీఎల్, జేఎల్ తుది ఫలితాలు వెల్లడించి ఉంటే వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాకపోయేవారని, ఇతర అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చేవని చెప్తున్నారు.

### మరో మెరిట్ అభ్యర్థికి ఇవ్వాల్సిందే..

నాన్‌జాయినింగ్ పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడితే నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని మేధావులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మళ్లీ ఆ శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చే వరకు నిరుద్యోగులు ఎదురుచూడాల్సి వస్తుందని చెప్తున్నారు. కటాఫ్ తర్వాత మెరిట్ సాధించిన అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఎస్పీ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం స్పందిస్తే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యి, తుది ఫలితాల్లో పేరురాని ప్రతిభావంతులకు న్యాయం జరుగుతుందని సూచిస్తున్నారు.